డీపీవో బాధ్యతల స్వీకరణ

పార్వతీపురం, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ అధికారిగా టి.కొండలరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చిన ఆయన అంతకుముందు విశాఖ, శ్రీకాకుళం జిల్లాల్లో డివిజనల్ పంచాయతీ అధికారిగా, పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి విస్తరణ అధికారిగా పనిచేశారు. కాగా డీపీవో కొండలరావు తొలుత కలెక్టరేట్‌లో కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పంచాయతీల అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని, పారిశుధ్యం, తాగునీరు సరఫరా తదితర అంశాల్లో ఆదర్శంగా నిలవాలని కలెక్టర్ ఆయనకు సూచించారు.



మక్కువ ఉమాశాంతేశ్వర గుహాలయం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

హర హర మహాదేవ

- శివాలయాలకు పోటెత్తిన భక్తులు
- భక్తిశ్రద్ధలతో కార్తీక మూడో సోమవారం పూజలు

కార్తీకమాసం మూడో సోమవారం సందర్భంగా జిల్లాలో శివాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. అంతటా శివనామస్మరణ మార్మోగింది. వేకువజామునే పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు నేరుగా శైవ క్షేత్రాలు, గుహాలయాలకు చేరుకున్నారు. గంటల తరబడి క్యూలో నిరీక్షించారు. అనంతరం ప్రత్యేక అలంకరణలో ఉన్న శివయ్యను దర్శించుకుని పులకించిపోయారు. విశేష పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. శివునికి ప్రీతికరమైన రోజు కావడంతో రుద్రాభిషేకాలతో పాటు సాలిగ్రామ దానాలు చేశారు. మహిళలు ఉపవాస దీక్షలు చేపట్టారు. సాయంత్రం ఆలయాలకు చేరుకుని దీపారాధనలు చేశారు. ఇళ్లలోనూ నోములు, వ్రతాలు నిర్వహించారు. మొత్తంగా జిల్లా అంతటా ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది.

- పూర్తి వివరాలు 6వ పేజీలో...



పారమ్మకొండ గుహలో పూజలందుకున్న శివయ్య

ప్రదక్షిణలే.. పరిష్కారాలేవి?



- క్షేత్రస్థాయిలో ఆచరణకు నోచుకోని వినతులు
- అత్యధికంగా పెండింగులో..
- రేషన్ కార్డులు, ఇళ్లు, పెన్షన్లపైనే ఎక్కువ విన్నపాలు
- భూ సమస్యలు ఎక్కడివక్కడే..
- కలెక్టరేట్ అర్జీదారులకూ తప్పని అవస్థలు

విజయనగరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం అధికారులు, ప్రజాప్రతినిధులకు అందిస్తున్న వినతులు పేపర్లకే పరిమిత మవుతున్నాయి. క్షేత్రస్థాయికి వచ్చేసరికి పరిష్కారం కాకపోవడంతో అర్జీదారులు అనేకసార్లు విన్నవించుకుం టున్నారు. అధికారులు మాత్రం పూర్తిస్థాయిలో దృష్టి సారించడం లేదు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎక్కువగా రెవెన్యూ సమస్యలపై వినతులు వస్తున్నాయి. అధికారులకు అందిన వినతుల్లో 80 శాతం భూ సమస్యలవే. గత ప్రభుత్వ హయంలో గ్రీవెన్స్, స్పందన, జగనన్నకు చెబుదాం వంటి పేర్లతో ప్రజల నుంచి వినతులు స్వీకరించేవారు. వాటిని మొక్కుబడిగా పరిశీలించి 90శాతం(రీడ్రస్) పరిష్కారం చేసినట్లు అధికారులు కాగితాలపై చూపించేవారు. దీంతో అర్జీదారులు పదేపదే కలెక్టరేట్ చుట్టూ తిరిగేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలోనూ అదే ఒరవడి కొనసాగుతోంది. ప్రజల నుంచి వచ్చిన వినతులను మండల, జిల్లా స్థాయి అధికా రులు, ఎమ్మెల్యేలు, మంత్రులు కాల్ సెంటర్ తదితర మార్గాల్లో విన తులు స్వీకరిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరు వాత వేలల్లో వినతులు రాగా.. వీటిల్లో 90శాతం వినతులు పరిష్కారం చేసినట్లు అధికార లెక్కలు చెబుతున్నాయి. బాధితులు మాత్రం ప్రతివారం కోకొల్లలుగా వస్తున్నారు. ఇళ్లు, ఇంటి రుణాలు, రేషన్‌కార్డులు, సామాజిక పింఛన్ల కోసం ఎక్కువ వినతులు ఇస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం దీనిపై ఒక నిర్ణయం తీసుకుంటే తప్ప ఈ సమస్యలు పరిష్కారం కాని పరిస్థితి. మరోవైపు భూ తగాదాలూ తగ్గడం లేదు. వచ్చిన వినతులను జిల్లా అధికార యంత్రాంగం ఆయా విభాగాలకు పంపుతోంది. వాటిలో 20 శాతం వరకూ ఎటువంటి స్పందన ఉండడం లేదు.

ఎంతో ప్రయాస పడి.. ఎన్నో ఇబ్బందులకు ఓర్చి.. నిరీక్షించి కలెక్టరేట్‌కు వచ్చి ఇచ్చే విన్నపాలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఒక సమస్యతో వచ్చిన వారే పదేపదే తిరిగి వస్తూ విన్నవించుకుంటున్నారు. వినతిపత్రాలు తీసుకునే సమయంలో అధికారులు హామీలైతే ఇస్తున్నారు. సంబంధిత మండల అధికారులకు పంపుతున్నారు. అక్కడితే ఆ వినతిపత్రం ఆగిపోతోంది. సమస్య అలాగే ఉండిపోతోంది. ఇదిలా ఉండగా కలెక్టరేట్‌కు వచ్చే విన్నపాల్లో అత్యధికంగా రేషన్‌కార్డులు, ఇళ్లు, పెన్షన్‌లు, భూ సమస్యలవే ఎక్కువ. ఎన్నాళ్లయినా కష్టం తీరడం లేదని అర్జీదారులు వాపోతున్నారు. 'ఆంధ్రజ్యోతి' విజిట్‌లోనూ ఇదే అభిప్రాయాన్ని ఎక్కువ మంది వ్యక్తం చేశారు.



పీజీఆర్ఎస్‌కు 156 వినతులు

పార్వతీపురం, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రం కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 156 వినతులు అందాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు రెవెన్యూ, ఇళ్లు, పింఛన్లు, రోడ్లు, రేషన్‌కార్డులు తదితర సమస్యలపై అర్జీలు అందించారు. వాటిని జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక, ఐటీడీఏ ఇన్‌చార్జి ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాస్తవ తదితరులు పరిశీలించారు. తక్షణ పరిష్కార నిమిత్తం వాటిని సంబంధిత అధికారులకు అందజేశారు.



కలెక్టరేట్‌లో అర్జీదారుల సమస్యలు వింటున్న జేసీ తదితరులు

మండల స్థాయిలో పకడ్బందీగా పీజీఆర్ఎస్

- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



పార్వతీపురం, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): మండల స్థాయిలో ప్రతి సోమవారం పకడ్బందీగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీల్లో కమిషనర్లు, మండల స్థాయిలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు పక్కాగా పీజీఆర్ఎస్‌ను నిర్వహించి.. ప్రజా సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. మండల, మున్సిపాలిటీ స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను జిల్లా స్థాయి పీజీఆర్ఎస్‌కు నివేదించాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో క్షేత్రస్థాయి అధికారులు అప్రమత్తంగా విధులు నిర్వహించాలన్నారు. అర్జీలను పరిష్కరించని సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేటి నుంచి మరుగుదొడ్ల దినం

జిల్లాలో మంగళవారం నుంచి మరుగుదొడ్ల దినం నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో ఆయన మాట్లాడుతూ.. మరుగుదొడ్ల దినం నేపథ్యంలో నేటి నుంచి డిసెంబరు 10 వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించా లన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు 469 మరుగుదొడ్లు మంజూరు చేశామని వచ్చేనెల 10 నాటికి వాటి నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. సూర్యఘర్ పథకం కింద సౌర విద్యుత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ఈపీడీసీఎల్ పర్యవేక్షక ఇంజనీర్ కె.చలపతిరావు, కార్యనిర్వాహక ఇంజనీర్ వేణుగోపాల్‌నాయుడు తదితరులున్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం

- ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి

సీతంపేట రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సీసీడీపీ నిధులతో గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. రక్షణ గోడలు, మల్టీ పర్పస్ కేంద్రాలు, సీసీ రహదారి నిర్మాణాలను వచ్చే నెల 15 నాటికి పూర్తిచేయాలన్నారు. జీవనోపాధి పథకాల అమలుకు లబ్ధిదారులను గుర్తించాలని సూచించారు. సీసీడీపీ నిధులతో సవర భాషా అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని టీడబ్ల్యూ డీడీ అన్నదొరను ఆదేశించారు. అనంతరం బోగస్ ఎస్టీ కుల ధ్రువపత్రాలకు సంబంధించి ఐటీడీఏకు వచ్చిన ఐదు కేసులపై ఆయన విచారణ చేపట్టారు. ఇరు వర్గాల వద్ద ఉన్న ఆధారాలను పరిశీలించారు. ఈ నెల 25వ తేదీకి విచారణ వాయిదా వేసినట్లు పీవో తెలిపారు. ఈ సమీక్షలో ఏపీవో చిన్నబాబు, టీడబ్ల్యూ ఇంజనీరింగ్ ఈఈ పి.రమాదేవి, డీఈ సింహాచలం, ఏఎంవో కోటిబాబు తదితర అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న ఇన్‌చార్జి పీవో

అన్నదాతను వేధిస్తున్న కూలీల కొరత



- తడిపిమోపుడవుతున్న ఖరీఫ్ ఖర్చులు
- అయినా సకాలంలో ముందుకు సాగని వ్యవసాయ పనులు
- రాయితీపై సాగు పరికరాలు అందించని గత వైసీపీ ప్రభుత్వం
- ఇబ్బందుల్లో రైతులు

పాలకొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులకు కూలీల సమస్య వెంటాడుతుంది. దీంతో ఆశించిన స్థాయిలో వ్యవసాయ పనులు సాగడం లేదు. జిల్లావ్యాప్తంగా ఒకేసారి వరి కోతలు మొదలైనప్పటికీ.. కూలీల కొరత నేపథ్యంలో అన్నదాతలకు ఖరీఫ్ ఖర్చులు తడిసిమోపెడవుతున్నాయి. వాస్తవంగా జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ కింద సుమారు 1.68 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు చేపట్టారు. పత్తి, మొక్కజొన్న, అరటి తదితర పంటలు సుమారు 50 వేల ఎకరాల్లో సాగు అవుతున్నాయి. కాగా ఇప్పుడిప్పుడే వరికోతలు ముమ్మరం చేసిన రైతులు పంటను కల్లాలకు తరలించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే కూలీల కొరతతో తలలు పట్టుకుంటున్నారు.



అందుబాటులో ఉన్న కూలీలతో వ్యవసాయ పనులు చేయిస్తున్న దృశ్యం

ఇదీ పరిస్థితి..

వలసల జిల్లాగా పేరొందిన 'మన్యం'లో కూలీలు రోజూ పనుల కోసం వివిధ ప్రాంతాలకు వెళ్తుంటారు. మరికొందరు పట్టణాలు, నగరాల్లో నెలవారి వేతనదారులుగా, భవన నిర్మాణ కార్మికులుగా, పరిశ్రమల్లో పనిచేస్తుంటారు. దీంతో కూలీల సమస్య జఠిలమవుతుంది. కాగా ప్రస్తుతం వారికున్న డిమాండ్ దృష్ట్యా కొన్నిచోట్ల అందుబాటులో ఉన్న కూలీలను కాంట్రాక్ట్ పద్ధతిపై కల్లాలకు తరలిస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో రైతులు వారితో ఒప్పందాలు కుదుర్చుకొని పనులు చేయిస్తున్నారు. కాగా నిన్న మొన్నటి వరకు ఎకరం కోతకు రూ.2,500 నుంచి రూ.3 వేల వరకు ఉండగా ప్రస్తుతం రూ.4,500 నుంచి రూ.6 వేలు వరకు డిమాండ్ చేస్తున్నారు. కోత కోసిన వరి పంటను ఓదులు చుట్టేందుకు ఎకరాకు గతంలో రూ.800 నుంచి రూ. 1000 ఉండగా, ప్రస్తుతం రూ.2 వేల నుంచి రూ.3వేల వరకు అడుగుతున్నారు. ఓదులను కళ్లాలకు తరలించి కుప్పలు వేసేందుకు ఇప్పటివరకు దూరం బట్టి రూ.2 వేలు నుంచి రూ.3 వేలు వరకు ఉండగా ప్రస్తుతం రూ.5 వేలు నుంచి రూ.6 వేలు వరకు వసూలు చేస్తున్నారు. పంటను ట్రాక్టర్ల, వరి యంత్రాల ద్వారా నూర్పు వేసేందుకు ఎకరాలకు రూ.2 వేల నుంచి రూ.3 వేలు వరకు తీసుకోగా, ఈ ఏడాది రూ.4 వేలు వరకు డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా విత్తనాలు కొనుగోలు మొదలు తిరిగి పంట దక్కేవరకు ఎకరాకు సరాసరి రైతుకు రూ.25 వేల నుంచి రూ.30 వేలు వరకు ఖర్చు అవుతుంది. దిగుబడి మాత్రం 25 నుంచి 28 బస్తాలకు మించి రావడం లేదు. మరోవైపు కూలీల ఖర్చులు తోడవడంతో కొన్ని ప్రాంతాల్లో రైతులు నష్టాలను చవిచూడాల్సి వస్తోంది.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో..

గత వైసీపీ ప్రభుత్వం రైతులను వ్యవసాయ యంత్ర పరికరాలకు దూరం చేసింది. సబ్సిడీ ధరలకు వరికోత యంత్రాలు, నూర్పుడి మిషన్లను అందించకపోడంతో జిల్లాలో రైతులు కూలీలపై ఆధారపడాల్సి వస్తోంది. కూలీల కొరతను అధిగమించేందుకు ఇప్పుడిప్పుడే రైతులు యంత్రాల వినియోగంపై మొగ్గు చూపుతున్నా.. పూర్తిస్థాయిలో అవి అందుబాటులో లేకపోవడంతో తలలు పట్టుకుంటున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సబ్సిడీపై నూర్పు, వరి కోత యంత్రాలను అందించారు. దీంతో అన్నదా తలకు ఎటువంటి ఇబ్బందులు ఉండేవి కావు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని జిల్లా రైతులు కోరుతున్నారు.

యంత్ర పరికరాల పంపిణీకి చర్యలు

జిల్లాలో రైతులకు అవసరమైన వ్యవసాయ యంత్ర పరికరాలను సబ్సిడీపై అందించేందుకు చర్యలు చేపడతాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే అన్నదాతల వినతుల మేరకు సాగు పరికరాలను అందుబాటులోకి తీసుకొస్తాం.

- రాబర్ట్‌పాల్, జిల్లా వ్యవసాయాధికారి, పార్వతీపురం మన్యం

ఆశాల ఆందోళన

- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్


బెలగాం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని ఆశా వర్కర్లు, సీహెచ్‌డబ్ల్యూలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద పెద్దఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని.. పని భారం తగ్గించాలని, కనీస వేతనం అమలు చేయాలని వారు నినదించారు. తమకు ఇన్సూరెన్స్ అమలు చేయాలని, బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని , సీహెచ్ డబ్ల్యూలను ఆశాలుగా గుర్తించాలని కోరారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, ఉద్యోగ విరమణ వయస్సు 62కు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ నిరసనలో ఆయా సంఘాల నాయకులు గౌరీశ్వరి, శివాణి, బృంద, రజని, సీఐటీయూ నాయకులు మన్మథరావు, కొల్లి సాంబ, సౌజన్య ఇందిరా తదితరులున్నారు.



ఓ ఊరి కథ

- నాడు పిరుత్తని గ్రామమే.. నేటి ఎల్విన్‌పేట
- ఆంత్రోపాలజిస్ట్ ఎల్విన్‌దొర జ్ఞాపకార్థంగా ఏర్పాటు
- బ్రిటీష్ ప్రభుత్వంలో గజిట్ నోటిఫికేషన్

6లో



ఓం నమః శివాయ



పశుపతి నాథేశ్వర ఆలయంలో స్ఫటిక లింగానికి ప్రత్యేక పుష్పాలంకరణ

కార్తీక మాసం మూడోసోమవారం ఆలయాలన్నీ శివనామ స్మరణతో మార్మోగాయి. తెల్లవారుజాము నుంచే మహేశ్వరుడికి పూజలు ఆరంభమయ్యాయి. పుణ్యగిరి ఉమాకోటి లింగేశ్వర ఆలయం, సంగాం సంగమేశ్వరస్వామి ఆలయాలు రద్దీగా కనిపించాయి. జలపాతాల వద్ద భక్తులు స్నానం చేసి శివుడి దర్శనానికి బారులు తీరారు.

- మూడో సోమవారం ఆలయాల్లో రద్దీ
- పుణ్యగిరిలో దర్శనానికి బారులు
- భక్తజన సందరమైన త్రివేణి సంగమం

పుణ్యగిరిలో బారులుదీరిన భక్తులు..

శృంగవరపుకోట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట పుణ్యగిరి శ్రీఉమాకోటి లింగేశ్వర ఆలయం శివనామస్మరణతో మార్మోగింది. భక్తులు, పర్యాటకుల వనసమారాధనలతో పరిసరాలు సందడిగా మారాయి. మూడో కార్తిక సోమవారం కావడంతో తెల్లవారుజాము నుంచి భక్తులు కొండెక్కారు. శ్రీదారగంగమ్మ లోయ జలపాతం, పుట్టదార జలపాతాల వద్ద స్నానాలు చేసిన భక్తులు స్వామిను దర్శించుకునేందుకు క్యూకట్టారు.

త్రివేణి సంగమం.. జనసంద్రం

వంగర, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సంగాంలోని త్రివేణి సంగమ ప్రాంతం సోమవారం కిటకిటలాడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు త్రివేణి సంగమ ప్రాంతంలో స్నానాలు చేస్తూ సందడి చేశారు. సంగాం సంగమేశ్వర స్వామి ఆలయ సమీపాన గల పెద్ద మహా మర్రివృక్షంతో పాటు సమీప తోటల్లో సమారాధనలు నిర్వహించారు. పచ్చని చెట్లు, నాగావళి, వేగావతి పచ్చిక బయల్లపై ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు.



గొట్టివలస కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

విజయనగరంలో..

విజయనగరం నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కార్తీక మూడోసోమవారం శివునికి అత్యంత ప్రీతిపాత్రమైన రోజు. ఈ రోజున శివయ్యను ఆరాధిస్తే సర్వదోషాలు తొలగి, మంచి జరుగుతుందని భక్తుల నమ్మకం. దీంతో ముక్కంటి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో శివయ్యకు ప్రత్యేక పూజలు, సామూహిక లింగార్చనలు, అభిషేకాలు నిర్వహించారు. విజయనగరం పశుపతినాథేశ్వర ఆలయంలో ముక్కంటి దర్శనానికి భక్తులు బారులు తీరారు.



త్రివేణి సంగమ ప్రాంతంలో పర్యాటకుల సందడి



శివాలయంలో దీపారాధన



రామతీర్థంలో..

నెల్లిమర్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం, సారిపల్లి దిబ్బేశ్వరాలయానికి మూడో సోమవారం అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి పూజలు నిర్వహించారు. రామతీర్థంలో ఉమాసదాశివ ఆలయంలో అర్చకులు రేజేటి మల్లికార్జునస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.



ఎస్.కోట పుణ్యగిరి కొండపై క్యూ కట్టిన భక్తులు



ఎండల మల్లికార్జునుడికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



విజయనగరం: నందెన్న వద్ద పూజలు

శివాలయాలకు కార్తీక శోభ

- ముగిసిన కుంబిడి యాత్ర



వీరఘట్టం: మల్లికార్జునుడికి పూజలు..

వీరఘట్టం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కార్తీక మూడో సోమవారం సందర్భంగా వీరఘట్టం మండలం కుంబిడి ఇచ్ఛాపురం గ్రామంలో నిర్వహించిన కుంబిడి యాత్రకు భక్తులు పోటెత్తారు. పరిసర ప్రాంతాలతో పాటు ఒడిశా నుంచి భారీగా తరలివచ్చిన భక్తజనం క్యూలైన్లలో గంటల కొద్దీ నిరీక్షించిన అనంతరం స్వయం భూ ఎండల మల్లికార్జున స్వామిని దర్శించికుని పులకించిపోయారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఎస్‌ఐ కళానిధి తమ సిబ్బందితో క్యూలైన్లు, వాహనాల పార్కింగ్‌లను పర్యవేక్షించి ప్రశాంతంగా యాత్ర జరిగేలా చూశారు. ● పార్వతీపురం టౌన్: జిల్లా కేంద్రంలో శివాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ముక్కంటిని దర్శించుకుని ఆలయాల ముఖద్వారం, ధ్వజ స్తంభాల వద్ద మహిళలు దీపారాధనలు చేశారు. ● సాలూరు రూరల్/సాలూరు: సాలూరులో పంచముఖేశ్వర ఆలయానికి భక్తులు పోటెత్తారు. శివదీక్షాధారులు ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. మంచాడవలస, పారమ్మకొండ, గమ్మలకొండ గుహాలయాల్లో ఉన్న శివలింగాలను భక్తులు దర్శించుకుని అభిషేక పూజలు చేశారు. ● గరుగుబిల్లి: తోటపల్లి, గొట్టివలస, గరుగుబిల్లి, తదితర గ్రామాల్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ● మక్కువ: మండల కేంద్రానికి అతి సమీపంలో ఉన్న ఉమా శాంతేశ్వర గుహాలయం వద్ద భక్తజనం బారులుదీరారు. ధ్వజ స్తంభాల వద్ద పసుపు, కుంకుమ పూజలు చేపట్టారు. ● సీతంపేట రూరల్: స్థానిక శివాలయంలో మహిళలు సుమారు 7.30 లక్షల దీపపు ఒత్తులను వెలిగించి దీపారాధన చేశారు. మరోవైపు ఆలయంలో శివుని దర్శనం కోసం భక్తులు క్యూ కట్టారు. ● భామిని: పెద్దదిమిలి ఎండల మల్లికార్జున స్వామి ఆలయంలో భారీ సంఖ్యలో భక్తులు అభిషేకాలు చేపట్టారు. మండల వాసులతో పాటు కొత్తూరు తదితర ప్రాంత భక్తులు భారీగా తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.



అఖండ దీపజ్యోతికి పూజలు చేస్తున్న భక్తులు



దిబ్బేశ్వరాలయం వద్ద పూజలు..



సాలూరు పంచముఖేశ్వర ఆలయంలో ధ్వజస్తంభం వద్ద దీపారాధన చేస్తున్న భక్తులు



పార్వతీపురం టౌన్: కంగటి వారి శివాలయం వద్ద దీపారాధన చేస్తున్న మహిళలు

అసెంబ్లీలో ఎమ్మెల్యేల గళం

మత్స్యకారులను ఆదుకోవాలి..

- ఎమ్మెల్యే నాగమాధవి



పూసపాటిరేగ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశాల్లో నెల్లిమర్ల ఎమ్మెల్యే నాగమాధవి సోమవారం భోగాపురం, పూసపాటిరేగ మండలాల మత్యకారుల వలసలు, జెట్టీ నిర్మాణం తదితర అంశాలపై మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం జెట్టీ నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చి ఐదేళ్ల కాలయాపన చేసిందన్నారు. మత్స్యకారుల సంక్షేమానికి నిధులు ఇవ్వడం ఆనందమేమన్నారు. 14 గ్రామాల్లో లెక్కల ప్రకారం 20వేల మంది మత్స్యకారులు ఉన్నారని చెప్పుకోవటమేగానీ.. గ్రామాల్లో ముసలివారు, చిన్న పిల్లలు తప్ప యువత కానరావటంలేదన్నారు. వారంతా జీవనోపాధికి వేర్వేరు ప్రాంతాలకు తరలిపోతున్నారన్నారు. వలస వెళ్లినచోట వారు మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బోట్లు, వలలు మునిగిపోవటం, కాలిపోవటం వంటి తరచూ జరుగుతున్నాయని, తద్వారా వారు నష్టపోతున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా జెట్టీ నిర్మాణం చేపట్టాలని ఆమె సూచించారు. సబ్సిడీపై పడవలు, వలలు తదితర పరికరాలను అందజేయాలని ఆమె కోరారు.

విశాఖ జిల్లాలో ఎస్.కోటను కలపాలి

- శాసన సభలో ప్రస్తావించిన ఎమ్మెల్యే లలితకుమారి

శృంగవరపుకోట నవంబరు 18(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం జిల్లాలో శృంగవరపుకోట నియోజకవర్గాన్ని కలపాలని స్థానిక శాసనసభ్యురాలు కోళ్ల లలిత కుమారి కోరారు. సోమవారం సభలో మాట్లేడేందుకు డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణం రాజు అవకాశం ఇవ్వడంతో ఈ విషయం ప్రస్తావించారు. గత వైసీపీ ప్రభుత్వం పార్లమెంటు నియోజకవర్గ ప్రాతిపాదికన జిల్లాలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించిందన్నారు. అయితే విశాఖపట్నం పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ఉన్న శృంగవరపుకోట నియోజకవర్గాన్ని మాత్రం విజయనగరం జిల్లాలోనే ఉంచారని గుర్తుచేసారు. శృంగవరపుకోట నియోజకవర్గం పూర్తి విశాఖ జిల్లాకు అనుకుని ఉన్నందున విద్య, వైద్యం తదితర వాటి కోసం ఆ జిల్లాపైనే అధికంగా ఆధారపడుతున్నారన్నారు.



తెరపైకి ఫీడర్ అంబులెన్స్‌లు



- అసెంబ్లీలో ఇద్దరు ఎమ్మెల్యేల ప్రస్తావన
- గిరి శిఖర గ్రామాల కష్టాలు ఏకరువు
- కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని గిరిజనుల్లో నమ్మకం
- గతంలో టీడీపీయే శ్రీకారం
- నిలిపేసిన వైసీపీ ప్రభుత్వం

● వైసీపీ ప్రభుత్వం గిరిజనులకు చెందిన 18 రకాల సంక్షేమ పథకాలను రద్దు చేసింది. 2014-2019 మధ్య తెలుగుదేశం ప్రభుత్వం అందించిన ఫీడర్ అంబులెన్స్‌లను నిర్వీర్యం చేసింది. దీంతో మళ్లీ కొండ శిఖర గ్రామాల గిరిజనులు కష్టాలు పడ్డారు. రహదారులు లేక డోలీలు కట్టి గర్భిణులు, అనారోగ్యంతో బాధపడుతున్నవారిని ఆసుపత్రులకు తీసుకెళ్లారు. ఇప్పటికీ రాళ్లు, పొదలను దాటుతూ కిందకు దించుతున్నారు. గత ప్రభుత్వం వారి కష్టాలను పట్టించుకోకుండా గిరిజనులకు అన్యాయం చేసింది. కూటమి ప్రభుత్వం మళ్లీ ఫీడర్ అంబులెన్స్‌లను ప్రవేశపెడితే గిరిజనులకు చాలా మేలు చేకూరుతుంది.

-శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి విన్నపం

● గిరిజనులకు వైద్య సేవలు అందించడంలో ఫీడర్ అంబులెన్స్‌లు కీలకపాత్ర పోషించాయి. గత వైసీపీ ప్రభుత్వం వీటిని నిలిపివేసింది. వెంటనే వీటిని పునరుద్ధరించాలి.

-అసెంబ్లీలో ప్రస్తావించిన విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజు

డోలీ ప్రయాణం.. ఎంత కష్టమో... రహదారి లేక గిరి శిఖర వాసులు ఎన్ని ఇబ్బందులు పడుతున్నారో.. ఎన్ని ఆపదలు ఎదుర్కొంటున్నారో.. సకాలంలో ఆస్పత్రికి చేరలేక ప్రాణాలు సైతం కోల్పోయిన వారెందరో... తదితర అంశాలపై శాసన సభ సమావేశాల్లో జిల్లాకు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు వివరించారు. ఫీడర్ అంబులెన్స్‌ల అవసరాన్ని నొక్కి చెప్పారు. గతంలో టీడీపీయే ప్రవేశపెట్టిందని గుర్తుచేశారు. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం వాటిని ఏ విధంగా నిర్వీర్యం చేసిందో తెలియజేశారు. తాజా పరిణామాలతో గిరిజనుల్లో ఆశలు చిగురించాయి. కూటమి ప్రభుత్వం తప్పకుండా తిరిగి ఫీడర్ అంబులెన్స్‌లు ప్రవేశపెడుతుందన్న నమ్మకంతో ఉన్నారు.

శృంగవరపుకోట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి)

జిల్లా నుంచి పార్వతీపురం మన్యం జిల్లా కొత్తగా ఏర్పడిన తరువాత కూడా విభజిత విజయనగరం జిల్లాలో గిరిజన ప్రాంతాలున్నాయి. శృంగవరపుకోట, గంట్యాడ, వేపాడ, కొత్తవలస, మెంటాడ తదితర మండలాల్లో గిరిజనులు నివశిస్తున్నారు. శృంగవరపుకోట మండలం దారపర్తి గిరిజన పంచాయతీ పరిధిలో దాదాపు పది శివారు గ్రామాలున్నాయి. ఈ గ్రామాలకు రహదారి లేదు. గిరి శిఖరాన ఉండడంతో కనీసం ద్విచక్రవాహనం వెళ్లే అవకాశం లేదు. దీంతో గర్భిణులు, చిన్నపిల్లలు, అనారోగ్యం బారిన పడిన వారిని ఆసుపత్రులకు తీసుకెళ్లేందుకు డోలీలు తప్పనిసరి. ఇలా తరలించే సమయంలో వైద్యం ఆలస్యం కావడంతో పలువురు మృతి చెందారు. ఎనిమిది నెలల క్రితం చిన్న పిల్లాడు, ఓ మహిళ రోజుల వ్యవధిలో చిట్టింపాడులో ప్రాణాలు కోల్పోయారు. అప్పట్లో మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, ఎం.శ్రీభరత్ కలసి కొండెక్కారు. ఆ గ్రామాన్ని చూశారు. మిగిలిన గ్రామాల దుస్థితిని చూసి చలించిపోయారు. అప్పుడే ఈ గ్రామాలకు రోడ్డు వేయిస్తామని మాటిచ్చారు. అనుకున్న ప్రకారం అధికారంలోకి రాగానే రోడ్డుకు రూ.11.50 కోట్లు మంజూరు చేయించారు. గంట్యాడ మండలం డీకేపర్తి పరిస్థితి ఇంతే. మెంటాడ మండలంలోనూ ఇలాంటి గ్రామాలున్నాయి. ఆయా గ్రామాలకు చేరుకోవడానికి రోడ్డు ఉంటే ఫీడర్ అంబులెన్స్‌లు కేటాయించే అవకాశం ఉంటుంది. ఇదే విషయాన్ని అసెంబ్లీలో ప్రస్తావించారు. శుక్రవారం కొచ్చన్ అవర్‌లో ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అడిగిన ప్రశ్నకు గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి స్పందిస్తూ ప్రస్తుతం వున్న ఫీడర్ అంబులెన్స్‌లతో పాటు కొత్తగా 47 ఫీడర్ అంబులెన్స్‌లు కేటాయించామని, 315 కిలోమీటర్లు పరిధిలో రోడ్ల నిర్మాణాలకు రూ.280 కోట్లు పరిపాలన అనుమతులు తీసుకున్నామని వివరించారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధి వైపుగా అడుగులు వేసింది. విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితిగజపతిరాజు కూడా అసెంబ్లీలో గిరిజనుల సమస్యలను ప్రస్తావిస్తూ ప్రధానంగా ఫీడర్ అంబులెన్స్‌లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. దీంతో గిరిజనుల్లో ఆశలు చిగురించాయి. కూటమి ప్రభుత్వం తప్పకుండా ఏర్పాటుకు చర్యలు తీసుకుంటుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేస్తున్నారు.

● పదేళ్లగా కొత్తవలస మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల కావాలన్న డిమాండ్ ఉంది. ఈ మండలానికి ఆనుకుని వున్న వేపాడ, ఎల్.కోట, జామి మండలాలకు చెందిన వారితో పాటు అనకాపల్లి జిల్లా మాడుగల నియోజకవర్గంలోని కె.కోటపాడు, దేవరాపల్లి, మండలాలకు చెందిన విద్యార్థులకు ఉపయోగకరంగా వుంటుంది. 2014-2019లో అధికారంలో వున్న తెలుగు దేశం ప్రభుత్వం ఈ కళాశాల ఏర్పాటుకు సిద్ధపడుతున్న సమయంలో ప్రభుత్వం మారింది. అధికారం చేపట్టిన వైసీపీ దీని గురించి పట్టించుకోలేదు. ప్రస్తుత కూటమి ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి శాసన సభలో ప్రస్తావన తేవడంతో కళాశాల ఏర్పాటు తథ్యమని స్థానికులు నమ్మకంగా ఉన్నారు.





ఎల్విన్‌పేట గ్రామం

ఓ ఊరి కథ

- నాడు పిరుత్తని గ్రామమే.. నేటి ఎల్విన్‌పేట
- ఆంత్రోపాలజిస్ట్ ఎల్విన్‌దొర జ్ఞాపకార్థంగా ఏర్పాటు
- బ్రిటీష్ ప్రభుత్వంలో గెజిట్ నోటిఫికేషన్

గుమ్మలక్ష్మీపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్విన్‌పేట గ్రామం పేరుకు ఓ చరిత్ర ఉంది. 1939లో అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం గుమ్మలక్ష్మీపురం మండలంలోని పిరుత్తని గ్రామాన్ని ఆంత్రోపాలజిస్ట్ ఎల్విన్‌దొర జ్ఞాపకార్థంగా ఎల్విన్‌పేటగా నామకరణం చేసింది. నాటి నుంచి నేటివరకు ఆ గ్రామం ఎల్విన్‌పేటగా కొనసాగుతుంది. ఎల్విన్‌దొర 1935-37లో పిరుత్తని గిరిజన ప్రాంతంలో పర్యటించి సవర, గగబ, జాతపు, కొండదొర గిరిజన తెగలపై అధ్యయనం చేశారు. వారి ఆచార వ్యవహారాలు, పెళ్లిళ్లు, పండగలు, వ్యవసాయం చేసే విధానం తదితర అంశాలపై అధ్యయనం చేసి ఆంత్రోపాలజీ పుస్తకాలు రచించారు. ఇవి ఎంతో ప్రాచుర్యం పొందాయి. ఎల్విన్ సేవలకు గుర్తింపుగా అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం 1939లో కురుపాం ఎస్టేట్ జమిందారీతో మాట్లాడి పిరుత్తని గ్రామాన్ని ఎల్విన్‌పేటగా మారుస్తూ గజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. అప్పటి నుంచి పిరుత్తని గ్రామం ఎల్విన్‌పేటగా కొనసాగుతుంది. ఎల్విన్‌దొర ఈ గ్రామానికి వచ్చిన సమయంలో అక్కడ 1,015 ఇళ్లే ఉండేవని, వారందరూ జాతీపు తెగవారని పెద్దలు చెబుతున్నారు. ప్రస్తుతం ఈ గ్రామంలో 4 వేల వరకు జనాభా నివసిస్తున్నారు. రక్షిత మంచి నీరు, డ్రైనేజీ, సీసీ రోడ్లు తదితర అన్ని రకాల సదుపాయాలు ఉన్నాయి. ఈ ప్రాంతానికి వచ్చే ఐఏఎస్‌లు తదితర ఉన్నతాధికారులు ఈ బ్రిటిష్ పేరు చూసి ఆ పేరు ఎలా వచ్చిందని ప్రశ్నించడం సర్వసాధారణమైంది. తమ గ్రామానికి ప్రముఖ ఆంత్రోపాలజిస్ట్ ఎల్విన్‌దొర పేరును పెట్టడం గొప్ప విషయంగా భావిస్తున్నామని సర్పంచ్ ఆర్.చైతన్య స్రవంతి హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికీ తమ ఓటరు ఐడీ కార్డులో పిరుత్తని గ్రామం పేరే కొనసాగుతుందన్నారు. ప్రభుత్వ రెవెన్యూ రికార్డుల్లో ఈ పేరే ఉందన్నారు. సివిల్ సర్వీస్‌కు వెళ్లేవారు ఎల్విన్‌దొర రచించిన పుస్తకాలను తప్పనిసరిగా చదువుతారని పరిశీలకులు చెబుతున్నారు.

ఇది గొప్ప విషయం..



మా గ్రామానికి ఆంత్రోపాలజిస్ట్ ఎల్విన్‌దొర జ్ఞాపకార్థంగా పేరు పెట్టడం గొప్ప విషయం. ప్రస్తుతం గ్రామంలో అన్ని కార్యాలయాలు, ఇతర సౌకర్యాలు ఉన్నాయి. సర్పంచ్‌గా ఈ గ్రామాన్ని అభివృద్ధి చేస్తున్నాను.

\- చైతన్య స్రవంతి, సర్పంచ్

నేడు అన్నకూటి మహోత్సవం

విజయనగరం రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక సిటీబస్టాండ్ సమీపంలోని అభయాంజనేయ స్వామి, కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో మంగళవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి మహాఅన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నటు అర్చకులు టీకే గాయత్రీ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. అభయాంజనేయ స్వామి వారికి 108 రకాల పిండివంటలు, వివిధ రకాల ఫలాలు నైవేద్యంగా పెట్టనున్నట్లు తెలిపారు.

గాయకుడు ఆదాడకు గద్దర్ పురస్కారం

విజయనగరం దాసన్నపేట, నవంబరు 18: (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన గాయకుడు, జనసేన నాయకుడు ఆదాడ మోహన్‌రావు గద్దర్ సేవా పురస్కారానికి ఎంపికయ్యారు. డిసెంబరు 12న డాక్టరు బీఆర్ అంబేద్కర్ జిల్లా పి.గన్నవరంలో మమతా స్వచ్ఛంద సంస్థ ఈ అవార్డును ప్రదానం చేయనుంది. ఈ సందర్భంగా మోహన్‌రావును జనసేన నాయకులు గురాన అయ్యలు తదితరులు అభినందించారు.

ఉన్నతిపై అవగాహన

లక్కవరపుకోట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా వంద రోజుల పని పూర్తి చేసిన వారికి శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం ఉన్నతి పథకాన్ని ప్రవేశపెట్టిందని ఏపీవో విజయలక్ష్మి సోమవారం తెలిపారు. 18 నుంచి 45 ఏళ్ల వయస్సు వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వృద్ధునికి చక్రాల కుర్చీ వితరణ

రాజాం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వీఆర్ అగ్రహారం గ్రామానికి చెందిన లింగాల జ్ఞానేశ్వరరావు వ్యవసాయ కూలీ. అనారోగ్యంతో ఆయన నడవలేని స్థితికి చేరుకున్నాడు. రెడ్‌క్రాస్ ప్రతినిధి పెంకి చైతన్యకుమార్ చొరవతో ఎచ్చెర్ల ఐఐటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ జీవన్ మడపాల ఆయనకు చక్రాల కుర్చీ సమకూర్చారు. సోమవారం దీనిని బాధితునికి అందించారు.

దేవాలయాలకు నీటి సదుపాయం

బాడంగి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరుకుల పాకల గ్రామంలో ఇ వివిధ దేవాలయాలకు నీటి సదుపాయం కల్పించామని ఎంపీటీసీ పాలవలస గౌరు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఎల్లమ్మతల్లి గుడి, రామాలయం, పైడితల్లి పేరంటాల గుడులకు నీటి సదుపాయాన్ని కల్పించామని చెప్పారు.

ఆస్తి పన్ను బకాయిలు చెల్లించాలి

విజయనగరం రింగురోడ్డు, నవంబరు 18: ఆస్తి, కుళాయి పన్నుల మొండి బకాయిలను ఉపేక్షించబోమని నగర పాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య స్పష్టం చేశారు. ఈమేరకు రెవెన్యూ సిబ్బంది, అడ్మిన్ కార్యదర్శులు బృందాలుగా ఏర్పడి, పన్నులు రాబపడుతున్నారు. ఎక్కువ మొత్తంలో బకాయిలు పడిన వారి కుళాయి కనెక్షన్లను సిబ్బంది తొలగిస్తున్నారు.

ఉచిత వైద్య శిబిరం

బొబ్బిలి రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మెట్టవలస గ్రామ సమీపంలో గల ఆసియన్ ఎయిడ్ హైస్కూల్ ఫర్ బ్లైండ్‌లో సోమవారం మండల న్యాయ సేవల కమిటీ ఛైరన్ సీహెచ్ఎల్‌వీ ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం, న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది జి.శాంతిలాల్, ప్రిన్సిపాల్ డా.వీఎస్‌కే రఘువంశీ, వైద్యాధికారి డాక్టర్ పి.హెప్సిబా తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేల్లో పోలీసుల పాత్రపై విచారణ

విజయనగరం క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎల్.కోట మండలం బీమాలిలో ఇటీవల కోడిపందాలు నిర్వహించిన వారిపై దాడి చేసి... వాహనాలను విడిచిపెట్టేందుకు డబ్బులు డిమాండ్ చేసినట్లుగా వచ్చిన ఆరోపణలపై విచారణ కొనసాగుతోందని డీఐజీ గోపీనాథ్ జట్టి ఓ ప్రకటనలో తెలిపారు. బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రాథమిక విచారణలో డబ్బులు డిమాండ్ చేసినట్లు వెల్లడి కావటంతో ఎస్పీ వకుల్ జిందాల్ డిఐజీ కార్యాలయానికి నివేదిక పంపారు. దీని ఆధారంగా సంబంధిత స్టేషన్‌లో అసిస్టెంట్ రైటర్‌గా పనిచేస్తున్న జి.సత్యానారాయణను సస్పెండ్ చేసినట్లు డీఐజీ తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

చీపురుపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జగన్నాథరాజు కాలనీకి చెందిన టి. నాగమణి సీలింగ్ ఫ్యానుకు ఉరి వేసుకొని సోమవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడింది. ఆమెకు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇంట్లో జరిగిన చిన్నపాటి గొడవకు మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె భర్త ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దామోదరరావు తెలిపారు.

ద్విచక్ర వాహనం చోరీ..

భోగాపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): భోగాపురంలో ద్విచక్ర వాహనం చోరీకి గురైనట్లు బాధితురాలు ఫిర్యాదు చేశారని సీఐ ప్రభాకర్ సోమవారం తెలిపారు. స్థానిక ఎస్‌బీఐ2 సమీపంలో నివాసముంటున్న ఆర్.ఉమాదేవి ఈ నెల 15న తన ఇంటి ముందు పల్సర్ ఏపీ39సి 2951 నెంబరు గల బైక్‌ను ఉంచారు. ఉదయం చూసేసరికి బైక్ కనిపించలేదని తెలిపారు. ఎంత వెదికినా దొరక్కపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు..

భోగాపురం, నవబరు18 (ఆంధ్రజ్యోతి): గుడివాడ గ్రామానికి చెందిన యువతి చిల్లా లిఖిత అదృశ్యమైనట్లు తల్లి చిల్లా ఎర్రయ్యమ్మ ఫిర్యాదు చేసినట్లు సీఐ ఎస్వీ ప్రభాకర్ తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి కనిపించకుండా పోయిందని తెలిపారు. ఈమేరకు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

పోక్సో కేసులో నిందితుడికి జైలు..

దత్తిరాజేరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో నిందితుడికి 3 సంవత్సరాల జైలు శిక్ష విధించినట్లు స్టేషన్ బూర్జవలస ఎస్ఐ జి.రాజేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పాచలవలస గ్రామానికి చెందిన సైలాడ లక్ష్మణరావు ఒక మైనర్ బాలిక అత్యాచారానికి పాల్పడినట్లు అప్పట్లో కేసు నమోదైనట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు నేరం రుజువు కావడంతో విజయనగరం జిల్లా పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి సోమవారం నిందితుడికి 3 సంవత్సరాల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పినట్లు తెలిపారు.

సారా విక్రయిస్తున్న మహిళ అరెస్టు..

విజయనగరం క్రైం, నవంబరు 18: (ఆంధ్రజ్యోతి): గుర్ల మండలం దేవుని కణపాకలో సారా విక్రయిస్తున్న టి.సూరప్పమ్మ అనే మహిళను అదుపులోకి తీసుకుని ఆమె వద్ద నుంచి ఐదు లీటర్ల నాటుసారాని స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌ఫోర్సుమెంటు సీఐ ఇందిరాదేవి తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం నెల్లిమర్ల ప్రొహిబిషన్ ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌కు అప్పగించినట్టు తెలిపారు.

నాటు సారాతో ..

కొత్తవలస, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నాటు సారాతో మహిళను అరెస్టు చేసి కొత్తవలస కోర్టులో హాజరుపర్చినట్లు ఎక్సైజ్ సీఐ రాజశేఖర నాయుడు తెలిపారు. రామలింగపురం గ్రామానికి చెందిన కక్కల లక్ష్మీ అనే మహిళ 5 లీటర్లు నాటు సారా కలిగి ఉండడంతో ఆమెను అదుపులోకి తీసుకుని సారా స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కొత్తవలస కోర్టులో హాజరు పర్చగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు చెప్పారు.

చిన్నాన్న కొడుకుపై యువకుడి దాడి

బొబ్బిలి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక మల్లమ్మదేవి పార్కు సమీపంలో ఆస్తుల గొడవలో సొంత చిన్నాన్న కొడుకుని ఓ యువకుడు గాయపరిచిన ఘటన చోటుచేసుకుంది. ఏఎస్ఐ జి.భాస్కరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వారణాశి వెంకటరమణ, అతని తమ్ముడు కోటేశ్వరరావుల కొద్ది కాలంగా ఆస్తుల కోసం గొడవ పడుతున్నారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి వెంకటరమణ కుమారుడు చైతన్య తన చిన్నాన్న కోటేశ్వరరావు కుమారుడు జయకృష్ణను రాడ్డుతో కొట్టి తలపై గాయపరిచాడు. బాధితుడు జయకృష్ణను స్థానిక ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నామని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ భాస్కరరావు తెలిపారు.

కనీస పింఛను రూ.9 వేలు ఇవ్వాలి

బొబ్బిలి రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఈపీఎస్ కనీస పింఛను రూ.9వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు డిమాండ్ చేశారు. స్థానిక తారకరామ కాలనీలో గల అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం విద్రోహ దినం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వి.శేషగిరిరావు, సీఐటీయూ నాయకులు ఎస్.గోపాలం, పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు టి.రమణ, జి.సింహాచలం, పి.కృష్ణ పాల్గొన్నారు.

వసతి గృహాల మరమ్మతులపై దృష్టి



విజయనగరం కలెక్టరేట్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ వసతి గృహాల సొంత భవనాలకు, మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ అంబేద్కర్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం తన చాంబర్‌లో సంబంధిత అధికారులతో ఏడాది కార్యాచరణ ప్రణాళిక పై సాంఘిక సంక్షేమ, గిరిజన శాఖ, బీసీ, మైనార్టీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారులతో సమీక్షించారు. మండల ప్రత్యేకాధికారులు ప్రతి నెల వసతి గృహాలను తనిఖీ చేసి.. నివేదికలను హెచ్‌వోడీలకు పంపాలని చెప్పారు. ఇదిలా ఉండగా.. ఇటీవల జిల్లా స్థాయిలో పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన పోటీల విజేతలను కలెక్టర్ అభినందించారు.

జేసీ అభినందన

ఆంధ్ర విశ్వవిద్యాలయ స్థాయిలో నిర్వహించిన బాక్సింగ్ పోటీల్లో విజేతలుగా నిలిచి.. జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించిన జిల్లా బాక్సింగ్ క్రీడాకారులను జేసీ సేతుమాధవన్ అభినందించారు. ఈమేరకు వీరంతా జేసీని సోమవారం కలిశారు.

ఆ ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు..

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గత వైసీపీ హయాంలో జరిగిన ఫ్రీహోల్డ్ భూములపై వాస్తవ సమాచారం ఇవ్వని రెవెన్యూ అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అంబేద్కర్ ఆదేశించారు. సోమవారం రాత్రి కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఫ్రీహోల్డ్ భూములపై సమీక్షా సమావేశం నిర్వహించారు. పొంతన లేకుండా వివిధ రకాల గణాంకాలతో కూడిన నివేదికలు ఇవ్వడంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. వెంటనే సమగ్ర నివేదికలు అందజేయాలని, లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జేసీ సేతుమాధవన్, డీఆర్‌వో శ్రీనివాస మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

గుర్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ఆరుద్ర అన్నారు. నడుపూరు గ్రామంలో చైల్డ్ రైట్స్ కార్యక్రమంలో భాగంగా కేంద్రం వద్ద సోమవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో స్థానిక హైస్కూల్ హెచ్ఎం శ్రీనివాసరావు, సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు

లక్కవరపుకోట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఈ నెల మొదటి వారంలో సేవ్ ది గర్ల్ చైల్డ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయిలో జరిగిన పోటీలో జమ్మాదేవిపేట వద్దగల మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలకు చెందిన వి.లత శ్రీ మొదటి బహుమతి సాధించింది. వక్తృత్వ పోటీల్లో ప్రతిభ చూపిన ఆమె సోమవారం కలెక్టర్ అంబేడ్కర్ నుంచి బహుమతి అందుకుంది. డ్రాయింగ్ పోటీల్లో ఇదే పాఠశాలకు చెందిన జి.మేఘన మూడో బహుమతి సొంతం చేసుకుంది. ఈ విద్యార్థినులను ప్రిన్సిపాల్ యూవీకే పాత్రో, సిబ్బంది అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

రేగిడి, నవంబరు 18: ఇటీవల కొప్పెర్లలో నిర్వహించిన జోనల్ స్థాయి పోటీల్లో స్థానిక గురుకుల పాఠశాలకు చెందిన 10 మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వీరంతా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్స్‌పాల్ పి.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు.

వెనుకబడిన విద్యార్థులపై దృష్టి

రేగిడి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈఓ వరప్రసాదరావు సూచించారు. కొండవలస ప్రాథమికోన్నత పాఠశాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. కొన్ని తరగతుల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించిన ఆయన ఈమేరకు సూచనలు చేశారు. ఆరో తరగతి విద్యార్థులకు ఆంగ్లభాషపై వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

అనాథలపై ఔదార్యం

రేగిడి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వావిలవలస రహుల్‌సౌరబ్ సత్రంలలోని అనాథలపై దేవదాయ శాఖ కార్యదర్శి సత్యనారాయణ ఔదార్యం చూపించారు. సామాజిక కార్యకర్త పాలూరి సిద్ధార్థ చొరవతో వీరందరూ తీర్థ యాత్రలు చేసేందుకు అవకాశం కల్పించారు. బస్సు సౌకర్యం, టిక్కెట్లు సమకూర్చారు సోమవారం వావిలవలస నుంచి ఈ బస్సు బయలుదేరింది.

సభ్యత్వ నమోదులో భాగస్వామ్యం

రాజాం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ చేపడుతున్న సభ్యత్వ నమోదు కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని జిల్లా ఎన్నికల అధికారి పైడి వేణుగోపాలరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోటగిరి నారాయణరావు పిలుపునిచ్చారు. సోమవారం పార్టీ కార్యాలయంలో నాలుగు మండలాల నాయకులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సహ ప్రముఖ్ శ్రీసంత్‌రావు, నాగేశ్వరరావు, బీజేపీ పట్టణ అధ్యక్షులు జొన్నాడ రంజిత్, గిరిబాబు, గుడివాడ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మంచి వైద్యులుగా పేరు తెచ్చుకోండి

గరివిడి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మంచి పశువైద్యాధికారులుగా ఎదగాలని రాష్ట్ర పశు సంవర్ధక శాఖ అదనపు సంచాలకులు డాక్టర్ వై.సింహాచలం విద్యార్థులకు సూచించారు. స్థానిక పశువైద్య కళాశాలలో సోమవారం ఫ్రెషర్స్‌డేని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన నూతనంగా గరివిడి పశువైద్య కళాలలో చేరిన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ మక్కేన శ్రీను, విశ్రాంత ట్రెజరీ శాఖ డిప్యూటీ డైరెక్టర్ భోగారావు, డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ జి.అర్చన పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం

తెర్లాం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కూనాయవలస గ్రామంలో కుక్కల దాడిలో శుక్రవారం 8 గొర్రెలు మృతి చెందిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బేబినాయన స్పందించారు మండల టీడీపీ అధ్యక్షులు నర్సుపల్లి వెంకటనాయుడు, మాజీ ఎంపీపీ వెంకటేశ్వరరావు చేతుల మీదుగా అప్పయ్యకు రూ.15 వేలు సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బోడెల సింహచలం, కరణం రమేష్, శంకరరావు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

ఇటు నిజాయితీ... అటు మానవత్వం

బొబ్బిలి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలో సోమవారం నిజాయితీ, మానవతలకు సంబంధించిన రెండు ఘటనలు చోటుచేసుకున్నాయి. స్థానిక దిబ్బవీధి శివాలయం దగ్గర అమ్మిగారి కోనేరు గట్టుకు చెందిన మహిళకు ఒకటిన్నర తులాల బంగారు బ్రాస్‌లెట్ దొరికింది. ఆమె వెంటనే తన భర్త మారోజు శంకరరావు ద్వారా ఆలయ అర్చకుని దృష్టికి తీసుకెళ్లింది. కింతలి నరసింహమూర్తి అనే భక్తుడు దానిని పోగొట్టుకున్నాడని తెలిసింది. దీంతో సీఐ సతీష్‌కుమార్ సమక్షంలో ఆభరణాన్ని నరసింహమూర్తికి అప్పగించారు. ఇదిలా ఉండగా.. స్థానిక ఎస్‌బీఐ సెంటరులో సోమవారం ఓ మహిళకు ఫిట్స్ వచ్చి అక్కడే ఉన్న విద్యుత్ స్తంభానికి ఢీకొని తీవ్రంగా గాయపడింది. అక్కడే ఉన్న ఇద్దరు విద్యార్థుల స్పందించి ఆమెను ఆసుపత్రిలో చేర్పించారు. అనంతరం ఆమె బంధువులకు సమాచారం అందించారు.

కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

బొబ్బిలి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో మోసపోయామని... ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో తమ జీవితాల్లో వెలుగులు నిండుతాయని ఎన్నో ఆశలు పెంచుకున్నామని విద్యుత్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు గునుపూరు సురేష్ అన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. కాంట్రాక్టు కార్మికులందరినీ రెగ్యులర్ చేస్తామన్న జగన్ హామీని నిలబెట్టుకోలేదని తెలిపారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ విజయవాడలో నిర్వహించిన జనవాణి కార్యక్రమంలో, నారా లోకేశ్ యువగళం యాత్రలో కూడా స్పష్టమైన హామీ ఇచ్చారని తెలిపారు. ప్రభుత్వ పెద్దలు తమ సమస్యలపై మానవతతో స్పందించి సానుకూలమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 205 వినతులు

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వివిధ సమస్యలపై 205 వినతులు వచ్చాయి. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్, జేసీ సేతుమాధవన్, డీఆర్‌వో శ్రీనివాస మూర్తి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వీటిలో 144 భూ సమస్యలు కాగా, పింఛన్ల కోసం 10, మున్సిపల్ శాఖకు సంబంధించి 8, పంచాయితీరాజ్ 6, విద్యాశాఖకు 10, వైద్య శాఖ నుంచి 6 వినతులు వచ్చాయి. ఈ సందర్భంగా జిల్లా అధికారులతో జేసీ సేతుమాధవన్ సమీక్షించారు. వచ్చిన వినతులకు నాణ్యమైన, కచ్చితమైన సమాధానాలు ఇవ్వాలని సూచించారు.

వినతులు తక్షణమే పరిష్కరించండి

విజయనగరం రింగురోడ్డు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన వినతులను తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని నగర పాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య తెలిపారు. సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ వేదికలో ప్రజల నుంచి మూడు వినతులు వచ్చాయి. టౌన్ ప్లానింగ్‌కు సంబంధించి రెండు, ఇంజనీరింగు విభాగానికి సంబంధించి ఒక వినతి వచ్చాయి. కార్యక్రమంలో ప్రజా రోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, ఈఈ టి.రాయల్‌బాబు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పట్టాలిచ్చి.. స్థలాలు చూపించలేదు

కొత్తవలస, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం ప్రభుత్వం 2014లో అధికారంలోకి వచ్చినప్పుడు కొత్తవలసలో సుమారు వేయి మంది పేదలకు పట్టాలు మంజూరు చేశారని.. వారికి ఇంతవరకు స్థలం చూపించలేదని సీపీఐ కార్యదర్శి డేగల అప్పలరాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఆందోళన చేశారు. సంబంధిత కాపీలను తహసీల్దార్ బి.నీలకంఠారావుకు అందజేశారు. పట్టాలు ఇచ్చిన వారికి స్థలాలు.. లేనివారికి పట్టాలు ఇవ్వాలని కోరారు.

గౌరీ సంఘం ఆత్మీయ కలయిక

శృంగవరపుకోట రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గవరపాలెం వద్ద గౌరీ సేవా సంఘం ఆత్మీయ కలయిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇందులో భాగంగా బ్రహ్మకుమారీల ఆధ్యాత్మిక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

రామ్మూర్తినాయుడు మృతి తీరనిలోటు

రామభద్రపురం, నవంబర్ 18 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోదరుడు నారా రామ్మూర్తినాయుడు మృతి తెలుగుదేశం పార్టీకి తీరనిలోటని విజయనగరం పార్లమెంటరీ టీడీపీ ఉపాధ్యక్షులు మడక తిరుపతినాయుడు అన్నారు. బూసాయవలస గ్రామంలో సోమవారం ఆయన విలేఖర్లతో మాట్లాడారు. రామ్మూర్తినాయుడు సేవలను స్మరించుకున్నారు.

పంటల బీమా గడువు పొడిగింపు

శృంగవరపుకోట రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జీడి పంటల బీమాకు గడువు ఈ నెల 22 వరకు పొడిగించినట్లు ఉద్యానవన శాఖ అధికారి అనిత తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మట్లాడుతూ రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రూ.10 నాణెంపై అవగాహన

శృంగవరపుకోట నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట రైతు బజారులో సోమవారం రూ.10 నాణెంపె ఎస్.బి.ఐ బ్రాంచి చీఫ్ మేనేజర్ పైడిరాజు, సిబ్బంది అవగాహన కల్పించారు. రైతులకు నాణా లు అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్టేట్ అధికారి సంతోష్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు వేగవంతం

బొబ్బిలి రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులను వేగవంతం చేయాలని డీఎల్‌డీఓ ఎమ్.కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. బొబ్బిలి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆయన ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏపీఓ లక్ష్మీపతిరాజు, ఇంజనీరింగ్ అధికారి కల్యాణచక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

బొబ్బిలి రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కారాడ గ్రామంలో సోమవారం బొబ్బిలి సీఐ కటకం సతీష్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. సైబర్ క్రైమ్, మహిళలు, చిన్నారులపై దాడులు, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామ పెద్దలు, పాల్గొన్నారు.

108 వాహన ఉద్యోగుల నిరసన దీక్ష



దీక్షలో పాల్గొన్న 108 సిబ్బంది

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): న్యాయమైన సమస్యలు పరిష్కరించాలంటూ 108 వాహన ఉద్యోగులు సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. రోజుకు మూడు షిఫ్టుల్లో 8 పని గంటలు అమలు చేయాలన్నారు. తమకు ప్రభుత్వ ఉద్యోగ నియమాకాల్లో వెయిటేజ్ మార్కులు ఇవ్వాలని కోరారు. ఈ డిమాండ్ నెరవేర్చకపోతే ఈనెల 25 నుంచి సమ్మె చేయనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు వి.అప్పలనాయుడు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్లు పరిష్కరించండి..

గుర్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ 104 సిబ్బంది ఎంపీపీ ప్రమీలకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు నెలనెల సక్రమంగా జీతాలు అందక కుటుంబ పోషణ కష్టమవుతోందన్నారు. 104 సేవలను ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో 104 ఉద్యోగులు డ్రైవర్ ఎస్.రవికిశోర్‌రాజు, డీఈవో ఎన్.శ్రీను తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందాల్

సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

● ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైం, నవంబరు 18: (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ రకాల బాధితుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎస్పీ వకుల్ జిందాల్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి 32 ఫిర్యాదులు స్వీకరించారు. సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి, సమస్యల పరిష్కరించాలని ఆదేశించారు. భూ తగాదాలకు సంబంధించి 9, కుటుంబ కలహాలకు సంబంధించి 4, మోసాలవి 7, ఇతర విషయాలకు సంబంధించి 11 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ఏడు రోజుల్లో సమస్యలు పరిష్కరించి, తీసుకున్న చర్యలను నివేదించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సౌమ్యలత, ఎస్‌బీ సీఐ లీలారావు, ఎస్ఐ రాజేష్, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఆఫీసర్స్ క్లబ్ క్రీడాకారుల సత్తా

విజయనగరం టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా సీనియర్స్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 11 నుంచి 17 వరకు పాలకొల్లులో నిర్వహించిన జాతీయ స్థాయి టెన్నిస్ పోటీల్లో విజయనగరం ఆఫీసర్స్ క్లబ్ క్రీడాకారులు సత్తాచాటారు. 45 ఏళ్లకు పైబడి వయో విభాగంలో డబుల్స్ కేటగిరిలో ఎంవీఎల్ఎన్ రాజు, సౌమిత్రి జోడి ట్రోఫీని సొంతం చేసుకున్నారు. వీరిని సీనియర్ టెన్నిస్ క్రీడాకారులు గాంధీ, రాంబాబు, వెంకట అప్పారావు, మల్లికార్జున్, శంకరరావు, రామారావు తదితరులు అభినందించారు.

చెస్ పోటీలకు 22 మంది ఎంపిక

విజయనగరం టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 9 నుంచి 17 వరకు ఫైర్ చెస్ స్కూల్ భవనంలో నిర్వహించిన జిల్లా ర్యాంకింగ్ చెస్ టోర్నీలో ప్రతిభ చూపిన 22 మంది క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారని ఆంధ్రా చెస్ అసోసియేషన్ సీఈవో కె.వి.జ్వాలాముఖి తెలిపారు. అండర్- 6 విభాగం నుంచి అండర్ 16 విభాగం వరకు బాల బాలికలకు నిర్వహించిన చెస్ పోటీల్లో ప్రతిభ చూపిన బాల బాలికలను ఇద్దరేసి చొప్పున ఎంపిక చేశామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫైర్ చెస్ స్కూల్ ప్రతినిధులు అర్చన, ఎన్.పద్మ, దామోదరరావు తదితరులు పాల్గొన్నారు.

హమాలీల సమస్యలు పరిష్కరించండి

విజయనగరం దాసన్నపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సివిల్ సప్లయిస్‌లో పనిచేస్తున్న హమాలీల సమస్యలు పరిష్కరించాలని లేదంటే సమ్మెకు దిగుతామని యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.కామేశ్వరావు హెచ్చరించారు. సోమవారం దాసన్నపేటలోని సివిల్ సప్లై జిల్లా మేనేజర్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు నర్సింహులు, నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ వార్డెన్ల ఆత్మీయ కలయిక

రామభద్రపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న రిటైర్డ్ వార్డెన్లు సోమవారం ఆత్మీయ కలయిక ఏర్పాటు చేశారు. నర్సాపురం గ్రామంలో గిరిజా రామలింగేశ్వరస్వామి ఆలయ సమీపంలో రిటైర్డ్ వార్డెన్ జక్కు రామానందం ఆధ్వర్యంలో దీన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ వార్డెన్ల సంఘ నాయకులు రొంగళి కనక సింహాచలం, అప్పలనాయుడు, మోహనరావు, జగ్గేన రామారావు, గౌరీప్రసాద్, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పక్కా ఇళ్లు మంజూరు చేయాలి

రామభద్రపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కొట్టక్కి సచివాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సచివాలయ సిబ్బందికి అందించారు. ఈ కార్యక్రమంలో లెంక లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంలో అశాస్త్రీయ విధానాలు

● ఏపీటీఎఫ్ నేతల ఆవేదన

బొబ్బిలి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో అశాస్త్రీయ, అసమంజసమైన విధానాలను ప్రభుత్వాలు కొనసాగిస్తుండడం బాధాకరమని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బొత్స పద్మావతి ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం జోనల్ సమావేశం బంకురు జోగినాయుడు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ విద్యారంగం నానాటికీ తీసికట్టుగా తయారు చేసే విధంగా విధానాలు అమలవుతున్నాయన్నారు. ఉద్యమాల ద్వారానే విద్యాపరిరక్షణ సాధ్యమన్నారు. రాష్ట్ర అకడమిక్ కన్వీనరు జేసీ రాజు మాట్లాడుతూ ప్రాథమికోన్నత పాఠశాలలు లేని వ్యవస్థను చేయడం సరికాదన్నారు. ఈ సమావేశంల నాయకులు ఎల్లయ్య, శ్రీనివాసరావు, లక్ష్మణరావు, రామకృష్ణ, రమేష్, చంద్రినాయుడు, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి కృషి



సభ్యత్వ నమోదును పరిశీలిస్తున్న కర్రోతు బంగార్రాజు

నెల్లిమర, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీ బలోపేతానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఏపీ మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు సూచించారు. మల్యాడ, జోగిరాజుపేట, అలుగోలు, గుసిని, సతివాడ గ్రామాల్లో సోమవారం సభ్యత్వ నమోదుపై సమీక్షించారు. టీడీపీ బలమైన పార్టీ అని ప్రతి ఒక్కరు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిది పోతల రాజన్న, నాయకులు పాల్గొన్నారు.

నీటి సంఘం ఎన్నికలపై దృష్టిపెట్టాలి

వీరఘట్టం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నీటి సంఘం ఎన్నికలపై దృష్టిసారించాలని తహసీల్దారు సత్యనారాయణ సూచించారు. తన కార్యాలయంలో సోమవారం వీఆర్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి సంఘం ఎన్నికల్లో ఓటరు జాబితా పేరు లేని వారి నుంచి దరఖాస్తులు స్వీకరించాలని తెలిపారు. భూ సమస్యల దరఖాస్తులు వస్తే వెంటనే పరిష్కరించాలన్నారు. గ్రామాల్లో నీటి తీరువా వసూలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ లక్ష్మణ్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నాటు సారా స్వాధీనం

కురుపాం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి కురుపాం వైపు అక్రమంగా ఆటోతో తరలిస్తున్న నాటుసారాను స్వాధీనం చేసుకున్నాట్లు ఎస్‌ఐ పి.నారాయణరావు తెలిపారు. సోమవారం మాలతమ్మ గుడి సమీపంలో ఇద్దరు వ్యక్తులు ఆటోతో వెళుతుండగా తనిఖీ చేశామని తెలిపారు. ఆటోలో ఐదు ట్యూబ్‌లు, ఒక క్యాన్‌తో 220 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని గొరడ గ్రామానికి చెందిన మండంగి వసంత, పువ్వల సుధాకర్‌లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పరిశుభ్రత అవసరం

కురుపాం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని అప్పుడే స్వచ్ఛత సాధ్యమని నియోజకవర్గ ప్రత్యేక అధికారి, డ్వామా పీడీ కె.రామచంద్రరరావు అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో స్వచ్ఛ సుందర కార్యక్రమం పై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్రరరావు మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు గ్రామాలు పరిశుభ్రమంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి పద్మావతి, స్వచ్ఛత సుందర సలహాదారు జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'మీకోసం'లో 79 వినతులు

సీతంపేట రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం ఇన్‌చార్జ్ పీవో యశ్వంత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 79 వినతులు వచ్చాయి. డీకేటీ పట్టాలు ఇప్పించాలని కొత్తూరు మండలం కొత్తగూడ గ్రామానికి చెందిన గిరిజనులు పీవోను కోరారు. కమ్యూనిటీ భవన నిర్మాణ పనుల బిల్లులు చెల్లించాలని దెబ్బగూడ గ్రామానికి చెందిన పి.గోపాలరావు విజ్ఞప్తి చేశారు. జజ్జువ గ్రామానికి సీసీ రహదారి నిర్మించాలని కిండంగి అనిల్ వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జి.చిన్నబాబు, ఈఈ రమాదేవి, డీడీ అన్నదొర, డిప్యూటీ డీఈఓ పి.నారాయడు, పీహెచ్‌ఓ వెంకట గణేష్, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈఈ జి మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మికులను వినియోగించొద్దు

భామిని, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): బాలలతో పనులు చేయిస్తే చర్యలు తప్పవని లేబర్ అధికారి శైలేష్‌కుమార్ పేర్కొన్నారు. భామినిలో అప్‌హోల్డ్ సంస్థ ఆధ్వర్యంలో చైల్డ్ లేబర్ రెస్క్యూ డ్రైవ్ నిర్వహించారు. కిరాణా షాపులు, హోటళ్లు, గ్యారేజ్‌లు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సోషల్ వర్కర్ తోట ప్రవీణ్‌కుమార్, కానిస్టేబుల్ ఎం.క్రాంతి, మహిళా పోలీస్ చందన పాల్గొన్నారు.

ఐఆర్ ప్రకటనలో జాప్యం తగదు

గజపతినగరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఐదు నెలలు గడుస్తున్నా ప్రభుత్వ ఉద్యోగుల పీఆర్సీ, ఐఆర్ గురించి ఆలోచించకపోవడం శోచనీయమని సెకండరీ గ్రేడ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కనకల చంద్రరావు సోమవారం ఒక ప్రకటనలో నిరసన వ్యక్తం చేశారు. కూటమి నాయకుల హామీలను పూర్తిగా విశ్వసించి తమ మద్దతు పలికామని తెలిపారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఐఆర్, పీఆర్సీలపై దృష్టి సారించలేదని, వెంటనే దీనిపై ఆలోచించాలని కోరారు.

నూతన కార్యవర్గం

చీపురుపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణ కళింగ వైశ్య వర్తక సంఘం కార్యవర్గం బాధ్యతలు స్వీకరించింది. సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కళింగ కోమటి సంఘం అధ్యక్షుడు బోయిన గోవిందరాజు వీరితోత ప్రమాణం చేయించారు. పొట్నూరు నరసింగరావు అధ్యక్షునిగా, సుంకరి చంద్రశేఖరగుప్త, పొట్నూరు త్రినాథరావు ఉపాధ్యక్షులుగా ప్రమాణం చేశారు. అందవరపు నగేష్ కార్యదర్శిగా, కొత్తకోట సురేష్ సంయుక్త కార్యదర్శిగా, కందుల పుండరి కోశాధికారిగా, సుంకరి సతీష్ సంయుక్త కోశాధికారిగా ప్రమాణం చేశారు. వీరితో పాటు మరో 21 మంది కార్యవర్గ సభ్యులుగా ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ వైశ్య ప్రముఖులు డా.టి.నీలకంఠేశ్వరరావు, పొట్నూరు ప్రభాకరరావు, తంగుడు రామకృష్ణ, అందవరపు హరి, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు వేగవంతం



కార్యకర్తలతో మాట్లాడుతున్న రెడ్డి పావని

గజపతినగరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని అన్నారు. సోమవారం స్థానిక బజార్ సెంటర్‌లో బీజేపీ మండల పర్వ అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 50 సభ్యత్వాలు చేయించిన కార్యకర్తలను క్రియాశీలక సభ్యులుగా గుర్తించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఏడు కొండలు, కార్యకర్తల పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి



రిలే నిరాహార దీక్ష చేస్తున్న 108 ఉద్యోగులు



నిరసన తెలుపుతున్న వివిధ సంఘాల నాయకులు

బెలగాం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తమకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనం అమలు చేయాలని 108 ఉద్యోగులు డిమాండ్ చేశారు ఈమేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా 108 ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గొర్లి అప్పల నాయుడు మాట్లాడుతూ 108 అంబులెన్స్ వ్యవస్థను ప్రభుత్వం నేరుగా నిర్వహించకుండా ప్రైవేటు సంస్థలకు అప్పజెప్పడం సరికాదన్నారు. ప్రైవేటు సంస్థలు ఉద్యోగులకు కనీస వేతనం అమలు చేయడం లేదని అన్నారు. ఉద్యోగ భద్రత, రిటైర్మెంట్ సదుపాయాలు, గ్రాట్యూటీ, పింఛను సౌకర్యం కల్పించడం లేదని ఆరోపించారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 25 నుంచి నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. ఈ దీక్షకు సీఐటీయూ మద్దతు తెలిపింది. ఈ కార్యక్రమంలో 108 ఉద్యోగులు టి.వెంకటరమణ, తెంటు రాంబాబు, సీఐటీయూ నాయకులు తదితరలు పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంలను నియమించాలి..

బెలగాం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్‌ఎంలను నియమించాలని, గిరిజన విద్యార్థి మరణాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని పలువురు గిరిజన, విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘాల నాయకులు మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాల, వసతి గృహాల్లో గిరిజన విద్యార్థులు ప్రభుత్వ నిర్లక్ష్యం కారణం గానే మరణిస్తున్నారని ఆరోపించారు. ఆశ్రమ పాఠశాలలో ఏఎన్‌ఎంలను నియమించాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన గిరిజన విద్యార్థుల కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. రావాడ రామభద్రపురం హెచ్‌ఎంను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, గిరిజన సంఘాల నాయకులు పండు, రవి, రంజిత్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి..

మక్కువ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వీఆర్‌ఏల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని విఆర్‌ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు జి.కృష్ణ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడలో ధర్నాకు వీఆర్‌ఏలు వెళ్లకుండా అన్ని మండలాల్లో ప్రభుత్వం పోలీసులతో గృహ నిర్బంధం చేయిస్తుందన్నారు. అర్హులైన వీఆర్‌ఏలకు వీఆర్‌వోలుగా అవకాశం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘ మండల కార్యదర్శి పవన్, సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అడ్డుకోవడం తగదు



మాట్లాడుతున్న వీఆర్‌ఏలు

సాలూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలని సాలూరు వీఆర్‌ఏల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు పాపారావు, జగన్‌లు కోరారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో వీఆర్‌ఏలు సమస్యల పరిష్కారం కోసం విజయవాడలో జరుగుతున్న ధర్నా కార్యక్రమానికి వెళ్లకుండా అన్ని మండలాల్లో ప్రభుత్వం పోలీసులను ప్రయోగించి అడ్డుకుందని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా వేస్తున్న నైట్ డ్యూటీలు, ఇసుక ర్యాంపులు, రైస్ మిల్లుల వద్ద డ్యూటీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ తరహాలు జీతాలు చెల్లించాలని కోరారు. వీఆర్‌ఓ, వాచ్‌మేన్, అటెండర్, రికార్డు అసిస్టెంట్ పోస్టులను అర్హులైన వీఆర్‌ఏలతో భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు రాజమాణిక్యం, దమయంతి, లక్ష్మీప్రసన్న, సీతమ్మ,పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.



డీఐఈవోను సత్కరిస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు

డీఐఈవో మంజులవీణకు సత్కారం

పార్వతీపురంటౌన్/ బెలగాం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రాష్ట్ర స్థాయిలో ఉత్తమ అధికారిగా అవార్డు అందుకున్న డీఐఈవో మంజుల వీణను మన్యం జిల్లా కాంట్రాక్టు అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి



ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొండ, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బుడితి అప్పలనాయుడు డిమాండ్ చేశారు. పాలకొండ నగర పంచాయతీ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. పట్టణాల్లో రెండు సెంట్లు ఇళ్ల స్థలం పేదలకు ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి రూ.ఐదు లక్షలు ఇవ్వాలని కోరారు. జగనన్న కాలనీలో విద్యుత్ బల్బులు పాడైనా పట్టించుకోవడం లేదన్నారు. అనంతరం నగర పంచాయతీ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. ఈ ధర్నాలో తవిటిరాజు, కృష్ణకుమారి, పద్మావతి, లక్ష్మీ, కె.రాజు, నాగమ్మ,షేక్ అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



వినతులు స్వీకరిస్తున్న కొండలరావు

పాలకొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పాలకొండ నగర పంచాయతీ కార్యాలయంలో టీడీపీ నాయకులు పల్లా కొండబాబు ప్రజా సమస్యలపై సోమవారం వినతులు స్వీకరించారు. ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరానికి కృషి చేస్తానని కొండబాబు హామీ ఇచ్చారు. జగనన్న కాలనీలో విద్యుత్, మంచినీటి ఇబ్బందులు ఉన్నాయని కొంతమంది వినతిపత్రాలు అందించారు. స్పందించిన ఆయన రోజుకు రెండు ట్యాంకర్ల నీరు అందిస్తానని హామీ ఇచ్చారు. విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని ట్రాన్స్‌కో అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

అడవిపై హక్కు ఆదివాసీలదే

మక్కువ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అడవిపై హక్కు ఆదివాసీలదేనని... అడవులను నాశనం చేస్తున్న మైనింగ్ కంపెనీలను అరికట్టాలని రైతు కూలి సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సింహాద్రి ఝాన్సీ అన్నారు. దుగ్గేరులో కామ్రేడ్ జన్ని తిరుపతి వర్ధంతి సభలో సోమవారం మాట్లాడారు. గిరిజనులకు అండగా ఉంటామని హామీ ఇచ్చిన ప్రధాని మోదీ ద్వంద్వ వైఖరి అవలంభిస్తున్నారన్నారు. గిరిజన బిడ్డలు బతుకు తెరువు కోసం పట్టణాలను ఆశ్రయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్య క్రమంలో రైతు కూలీ సంఘ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి వర్మ, జిల్లా అధ్యక్షుడు ఊయక ముత్యాలు, సహాయ కార్యదర్శులు పి.శ్రీనాయుడు, భాస్కర్‌రావు, ఉపాధ్యక్షులు అసిరి పాల్గొన్నారు.

పేదలకు రెండు సెంట్ల స్థలమివ్వాలి

బెలగాం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కూటమి ఇచ్చిన హామీ ప్రకారం పట్టణంలోని పేదలకు రెండు సెంట్ల స్థలం ఇవ్వాలని, నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఆర్వీఎస్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం బెలగాంలోని 10వ సచివాలయంలో కార్యదర్శి ప్రసన్నకు వినతి పత్రాన్ని ఇచ్చారు.

పంట కోత ప్రయోగం

బలిజిపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అంపావల్లి గ్రామంలో సోమవారం పంట కోత ప్రయోగం నిర్వహించారు. బంకూరు గౌరు నాయుడు అనే రైతు పొలంలో దీన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మూడడ్ల శ్రావణ్ కుమార్ నాయుడు, వ్యవసాయ సహాయకులు కె.శ్రావణ్, రైతులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

గజపతినగరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇళ్లులేని నిరుపేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి పురం అప్పారావు డిమాండ్ చేశారు. గజపతినగరం, పురిటిపెంట గ్రామ పంచాయితీల్లో నిరుపేదలకు ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలని కోరుతూ సోమవారం అధికారులలకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టి.జానకి, పి.మణి, జి.రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వినతి పత్రాన్ని అందజేస్తున్న పురం అప్పారావు



ఇన్‌చార్జి మంత్రిని కలిసిన ఎమ్మెల్యే జగదీశ్వరి

కొమరాడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును కురుపాం ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి అమరావతిలో సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో ఉన్న సమస్యలను ఇన్‌చార్జి మంత్రికి విన్నవించారు. ముఖ్యంగా నాగావళి నదిపై వంతెన నిర్మాణం పూర్తి చేయడంతో పాటు గిరి శిఖర గ్రామాలకు పక్కా రహదారులు నిర్మాణం పూర్తయితే డోలీ మోతలు గి తప్పుతాయని మంత్రి దృష్టికి తీసుకువెళ్లినట్లు ఆమె తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.ఉదయశేఖర్‌పాత్రుడు, టీడీపీ నాయకులు పి.వెంకటనాయుడు, ఎన్.కృష్ణబాబు, తదితరులు ఉన్నారు.



ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడును కలిసిన ఎమ్మెల్యే జగదీశ్వరి, ఉదయశేఖర్ పాత్రుడు

అంగన్‌వాడీ కేంద్రాలను మెరుగుపరుస్తాం

● రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

పార్వతీపురం/సాలూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలను అన్నివిధాలుగా మెరుగుపరుస్తామని రాష్ట్ర స్త్రీశిశు సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. స్థానిక విలేకరులతో ఆమె సోమవారం ఫోన్‌లో మాట్లాడారు. ప్రాథమిక సదుపాయాల కోసం 7,090 అంగన్వాడీ కేంద్రాలకు ఒక్కొక్కదానికి రూ.లక్ష చొప్పున రూ.70.90 కోట్లు విడుదల చేసిందని అన్నారు. ఈ నిధులతో ఎల్‌ఈడీ టీవీలు, ఆర్వో ప్లాంట్లు, బెంచీలు, కుర్చీలు, పిల్లలకు బొమ్మలు వంటి సదుపాయాలను కల్పించనున్నట్టు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలోని 55,607 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా 5,31,446 మంది గర్భవతులు, బాలింతలకు, 13,03,384 మంది మూడేళ్ల లోపు పిల్లలకు, ఏడు లక్షల మంది మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లలకు పోషకాహార సేవలు అందజేస్తున్నట్లు ఆమె తెలిపారు. అంగన్వాడీ సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని అన్నారు.

రేపు క్రీడా పోటీలు

సీతంపేట రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి):జన జాతీయ గౌరవ దివస్ కార్యక్రమంలో భాగంగా వివిధ పోటీల్లో క్లస్టర్ స్థాయిలో ఎంపికైన విద్యార్థులు ఈనెల 20న స్థానిక గ్రీన్‌ఫీల్డ్ మైదానంలో నిర్వహించబోయే ఐటీడీఏ స్థాయి పోటీలకు హాజరుకావాలని ఇన్‌చార్జ్ పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ఎంపికైన విద్యార్థులు ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు విశాఖలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పీవో చెప్పారు.

పార్వతీపురంలో...

పార్వతీపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి గిరిజన బాలబాలికల క్రీడా పోటీలు ఈ నెల 20న పార్వతీపురంలో ఉన్న గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో జరుగనున్నాయి. ఏటీడబ్ల్యువో పరిధిలో ఎంపికైన క్రీడాకారులు మాత్రమే అర్హులు. ఈ పోటీల్లో గెలుపొందిన వారు ఈ నెల 23 నుంచి 26 వరకు విశాఖపట్నంలో జరుగు జన జాతీయ ఉత్సవాల్లో పాల్గొంటారని జిల్లా గిరిజన సంక్షేమాధికారి గయావుద్దీన్ తెలిపారు.

బహిరంగ వేలం

పార్వతీపురం టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) తోటపల్లి హెడ్ వాటర్ వర్క్సు వద్ద గల కొబ్బరి, జీడి, మామిడి చెట్ల ఫలసాయానికి సంబంధించి ఈ నెల 21న వేలం వేయనున్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరిగే బహిరంగ వేలానికి ఆసక్తి గల పాటదారులు హజరు కావాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజు సోమవారం కోరారు. పురపాలక సంఘ ఆధీనంలో ఉన్న ఐడీఎస్ఎంటీ షాపులు అద్దె ప్రాతిపదికన అదే రోజు ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం జరుగుతుందని ఆయన తెలిపారు.

23న జాబ్‌మేళా

పార్వతీపురం టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మన్యం జిల్లా కేంద్రంలో గల కొత్తవలస శ్రీ వేంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఈనెల 23న జాబ్ మేళా నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ చలపతిరావు సోమవారం తెలిపారు. ఎస్ఎస్‌సి, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, బీటెక్, ఎంఎస్‌సి ఉత్తీర్ణులై, 35 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. పూర్తి వివరాల కోసం 9491571727, 8297400777, 7799376111 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

కక్ష సాధింపు తగదు

పార్వతీపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖాధికారుల తీరు ఉపాధ్యాయుల మీద కక్ష సాధించేలా ఉందని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహేష్, బాలకృష్ణ విమర్శించారు. ఉన్నత పాఠశాలల పనివేళలు దశాబ్దాలుగా రోజుకు ఏడు గంటల చొప్పున అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. ఇప్పుడు పని వేళలు పెంచడం సరికాదన్నారు. అధికారులకు విద్యార్థులపై ప్రేమ ఉంటే ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినహాయించాలని సూచించారు. బదిలీల విషయంలో ఒకే శ్లాబ్‌లో ఇంటి అద్దె అలవెన్స్ పొందుతున్న ఉపాధ్యాయులు మధ్య చిచ్చు పెట్టడానికి జనాభా ప్రాతిపదికను తెరపైకి తెచ్చారని ఆరోపించారు.

శ్రీకాశీవిశ్వేశ్వర స్వామి ఆలయానికి విరాళం

గరుగుబిల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి గ్రామంలోని శ్రీవిశాలాక్షీ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి దాతలు విరాళాలు అందజేస్తున్నారు. సోమవారం సంతోషపురం మాజీ సర్పంచ్ అంబటి గౌరునాయుడు, నారాయణమ్మ దంపతులు రూ. 1,00,016 ఆలయ అర్చకులకు విరాళంగా అందజేశారు. గుమ్మలక్ష్మీపురం మండలం పి.ఆమిటి గ్రామానికి చెందిన ఉపాధ్యాయురాలు ఎం.రాజేశ్వరి విరాళం అందజేశారని అర్చకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వడ్డి మహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ స్పెషల్ డ్రైవ్‌ను వినియోగించుకోవాలి

పార్వతీపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సచివాలయల్లో నిర్వహించబోయే ఆధార్ స్పెషల్ డ్రైవ్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా నోడల్ అధికారి బి.రాంగోపాల్ సూచించారు. ఈ నెల 19 నుంచి 22 వరకు, తిరిగి 26 నుంచి 29కు జిల్లాలో ఆధార్ స్పెషల్ డ్రైవ్ జరుగనున్నట్టు తెలిపారు. జిల్లాలో 49 శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.

వైభవంగా నందన్న పుణ్యస్నానం

పాలకొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెదకాపువీధిలో గుమ్మడు, పామోటి కుటుంబాల ఆధ్వర్యంలో కార్తీక మూడో సోమవారం సందర్భంగా నందన్నకు పుణ్యస్నానం చేయించారు. అనంతరం 1100 మందికి అన్న ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుమ్మడి సింహాద్రి, ఉమామహేశ్వరరావు, శాసపు సర్వారావు, పామోటి వీరన్నాయుడు, గుమ్మడి శంకరరావు, గుమ్మడి కృష్ణ, బొత్స అప్పలనాయుడు, పామోటి తవుడు, వెంకటేష్, చిన్నయ్య, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

రూఫ్‌వాటర్ హార్వెస్టింగ్ పనులు ప్రారంభం

వీరఘట్టం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహ సీల్దారు, ఎంపీడీఓ కార్యాలయాల వద్ద ఉపాధి హామీ నిధులతో రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ పనులు సోమవారం ప్రారంభించారు. ఈ కార్య క్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, హరిబాబు, రమేష్ పాల్గొన్నారు.